క్లుప్తంగా

హుండీలో నగదు చోరీ

కంభం: ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు అపహరించుకెళ్లిన సంఘటన సోమవారం జరిగింది. వివరాలు.. స్థానిక వాసవీ స్కూల్ వెనుక వైపున ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో దొంగలు సోమవారం తలుపులు పగలగొట్టి లోపల ఉన్న హుండీలోని నగదు దోచుకెళ్లారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హుండీలోని నగదును ఐదు నెలలుగా తీయలేదని, సుమారు ఐదు వేల రూపాయలకు పైగా నగదు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. నివాసాల మధ్య ఉన్న గుడిలో దొంగతనానికి పాల్పడటంతో చుట్టుపక్కల వారు ఆందోళన చెందుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

గిద్దలూరు రూరల్: మండలంలోని గడికోట అటవీ శాఖ చెక్‌పోస్టు సమీప పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలు చోరీకి గురైన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులోని రాగి వస్తువులను అపహరించారు. బయట పడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విడి భాగాలను గమనించిన స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్థానిక పోలీసులకు విద్యుత్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

దేవస్థాన కమిటీ చైర్మన్‌గా గురుబ్రహ్మం

తాళ్లూరు(ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటిగంగా భవాని అమ్మవారి దేవస్థాన నూతన కమిటీ చైర్మన్‌గా కొనస గురుబ్రహ్మం పలువురు సోమవారం అభినందించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం గురుబ్రహ్మంను కలిసి అభినందనలు తెలిపారు. మాజీ చైర్మన్ కె.శ్రీనివాసరావు, నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు యాడిక యలమందారెడ్డి, తూర్పుగంగవరం వైస్ సర్పంచ్ వై కాశిరెడ్డి, ఎంఎల్‌ఓ బి.నాగమల్లేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పి.దేవదానం, ప్రసాదరెడ్డి, తదితరులు ఉన్నారు.

పుస్తక పఠనం మనోవికాసానికి దోహదం



కవి విశ్వనాథాన్ని సన్మానిస్తున్న ఎంఈవోలు

యర్రగొండపాలెం: పుస్తక పఠనం విద్యార్థుల మనోవికాసానికి దోహద పడుతుందని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ కవి దేవులపల్లి విశ్వనాథం సంకలనం చేసి రచించిన 'తెలుగు సామెతలు-జాతీయాలు' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని ఆయన హెచ్‌ఎంను ఆదేశించారు. అనంతరం కవి విశ్వనాథాన్ని ఘనంగా సన్మానించారు. ఎంఈవో-2 మల్లూనాయక్, హెచ్‌ఎం వి.పిచ్చిరావు, అటవీశాఖాధికారి నాగశ్రీ పాల్గొన్నారు.

అవినీతిని రూపుమాపుతాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ భీమానాయక్

మార్కాపురం: సమాజంలో ఉన్న అవినీతిని రూపుమాపేందుకు అందరూ కృషిచేయాలని సీఐ ఎం.భీమానాయక్, ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బందితో సోమవారం పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల అర్జీలపై సత్వరమే స్పందించి న్యాయం చేయాలని సూచించారు. ఎస్సైలు కోటేశ్వరరావు, వెంకటేశ్వరనాయక్, ఏఎస్‌ఐలు మునాఫ్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: మండలంలోని సూరేపల్లెలో వరి పంటలను సోమవారం స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వరి పంటలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సంచాలకుల ద్వారా రైతులు వ్యవసాయంలోని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి రైతు వారి పంటలను ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. గిద్దలూరు మండల పరిధిలో 642 ఎకరాల్లో వరి సాగవుతోందన్నారు. పంట ప్రస్తుతం పొట్ట ఈనే దశలో ఉందన్నారు. వరి పంటలో అగ్గి తెగులు ఉన్నట్లు గమనించారు. ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎమ్మెల్యే కేపీ జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి కేక్ తినిపిస్తున్న ఇస్మాయిల్, షంషేర్, కృష్ణ

మార్కాపురం: ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం మార్కాపురం పట్టణం, రూరల్ గ్రామాలతోపాటు తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో కేకులు కట్‌చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచే ఎమ్మెల్యే నివాసం వద్ద పుట్టినరోజు వేడుకలు ప్రారంభమయ్యాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా బద్రీనాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, ఎంపీపీలు అరుణ చెంచిరెడ్డి, భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి, వాకా వెంకటరెడ్డి, మోరబోయిన మురళీకృష్ణ, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, ఏడుకొండలు, మార్కాపురం ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, తర్లుపాడు, కొనకనమిట్ల మండల కన్వీనర్లు మురారి వెంకటేశ్వర్లు, మోరా శంకర్‌రెడ్డి, పారిశ్రామికవేత్త కేపీ హనుమంతారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు తడికమళ్ల బాలసుబ్బారావు, పొదిలికి చెందిన డి.శ్రీనివాసరెడ్డి, షేక్ నూర్జహాన్ బేగం, గొలమారి చెన్నారెడ్డి, జి.సంజీవ్‌రెడ్డి, కల్లం వెంకట సుబ్బారెడ్డి, జి.రమణారెడ్డి, సాయి రాజేశ్వరరావు, నరసింహారావు, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, ఆలయాల చైర్మన్లు పెనుగొండ కేశవరావు, గోపాలుని హరిహరరావు, వి.కేశవరావు, కొండేపల్లి ఎంపీటీసీ మల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ సూరవరపు పెదవెంకటరెడ్డి, ఏలూరి సంజీవరెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, మార్కాపురం సీఐ భీమానాయక్, పొదిలి సీఐ కేవీ రాఘవేంద్ర, ఎస్సైలు కోటేశ్వరరావు, వెంకటేశ్వర నాయక్, బ్రహ్మానాయుడు, సుధాకర్, వెంకట సైదులు తదితరులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

■ మార్కాపురం 19వ వార్డులో పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు.

■ మార్కాపురం మార్కెట్ యార్డులో చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. స్ఫూర్తి మానసిక వికలాంగుల కేంద్రంలో విద్యార్థులకు గొలమారి రామిరెడ్డి, నూనె వెంకటేశ్వరరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వీరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

■ **తర్లుపాడు:** మండలంలోని మీర్జపేటలో సర్పంచ్ మీరయ్య, గొల్లపల్లిలో సర్పంచ్ రామిరెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేశారు. మీర్జపేట జెడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటారు.

■ **పొదిలి రూరల్:** పొదిలి పంచాయతీరాజ్ భవనం వద్ద కల్లం వెంకట సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసులు, జి.రమణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి మ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతోపాటు పేదలకు బిర్యానీ పంపిణీ చేశారు. డాక్టర్ యర్రం వెంకటరెడ్డి, గూడూరి వినోద్, పేరం కోదండ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ **కొనకనమిట్ల:** మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు యక్కంటి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ పునుగోటి కొండారెడ్డి, సచివాలయ కన్వీనర్ సూరవరపు అనంతలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న కొనకనమిట్ల ఎంపీపీ, నాయకులు



పొదిలిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

తీరనున్న అర్ధవీడు మండల ప్రజల చిరకాల కోరిక



నాబార్డు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

- రంగాపురం-అర్ధవీడు రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే అన్నా, అధికారుల పరిశీలన
- రూ.25 కోట్ల నాబార్డు నిధుల మంజూరు కోసం ప్రణాళికలు సిద్ధం చేయనున్న అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్ధవీడు మండల ప్రజలు

అర్ధవీడు (కంభం): మండలంలో రంగాపురం నుంచి మండల కేంద్రమైన అర్ధవీడుకు రోడ్డు మార్గం కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ప్రజల ఆకాంక్ష త్వరలో నెరవేరనుంది. రంగాపురం నుంచి అర్ధవీడుకు వెళ్లాలంటే సుమారు 70 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే కేవలం 7.76 కిమీలో అర్ధవీడు చేరుకోవచ్చు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఫారెస్టు అధికారులు, ఉన్నతాధికారులతో మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నాబార్డు, పంచాయతీరాజ్, ఫారెస్టు అధికారులతో కలిసి ఎమ్మెల్యే రంగాపురం రోడ్డు నిర్మాణం చేయబోతున్న మార్గాన్ని పరిశీలించారు. పరిశీలించిన నాబార్డు అధికారులు రోడ్డు నిర్మాణం కోసం రూ.25 కోట్ల నిధుల మంజూరుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్ధవీడు మండల ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతోందన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే రంగాపురం ప్రజలు చుట్టూ తిరిగి వ్యయప్రయాసాలు పడాల్సిన పని లేకుండా కేవలం 8 కిలో మీటర్ల లోపే అర్ధవీడుకు చేరుకుంటారన్నారు. ఫారెస్టు ల్యాండ్‌కు బదులు వారికి రెవెన్యూ ల్యాండ్ ఇవ్వనుండటంతో ఫారెస్టు క్లియరెన్స్ లభించనుండటంతో రోడ్డు నిర్మాణానికి ఎటువంటి ఆటంకాలు ఉండబోవని తెలిపారు. ఎమ్మెల్యే అన్నా అధికారులతో కలిసి రంగాపురం ఆవుల కొండ పరిసర ప్రాంతాలు పరిశీలించిన అనంతరం అర్ధవీడుకు చెరువుకొని ఆ రోడ్డు చేరే మార్గాలను పరిశీలించారు. నాబార్డు కన్సల్టెంట్ పి. దుర్గాప్రసాద్, డెవలప్‌మెంట్ మేనేజర్ రవికుమార్ పీఆర్ ఈఈ రమేష్‌బాబు, ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు, ఎఫ్ఆర్వో మధు ప్రియాంక, ఎంపీపీ వెంకట్రావు, మాజీ ఎంపీపీ రవికుమార్ యాదవ్, తహసీల్దార్ అత్తార్ నాయబ్ హుస్సేన్, ఎంపీడీఓ జగదీష్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ చలమారెడ్డి తల్లి మృతి



లక్ష్మీదేవికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్ తనయుడు విశాల్

పెద్దారవీడు: మండలంలో ఏనుగులదిన్నెపాడులో జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి తల్లి లక్ష్మీదేవి ఆదివారం రాత్రి మృతి చెందారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి తనయుడు, జార్జి విద్యా సంస్థల సెక్రటరీ ఆదిమూలపు విశాల్.. లక్ష్మీదేవి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎర్రగొండపాలెం ఎంపీపీ దొంత కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, డీసీఓ నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి సతీమణి సుబ్బమ్మ, ఎంఈఓ శ్రీనివాసులు, సచివాలయ మండల కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బలుసుపాటి లూథియా, ఎంపీటీసీలు, సర్పంచులు.. లక్ష్మీదేవి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యుత్ ప్రమాద బాధితునికి రూ.5 లక్షల పరిహారం

- చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేపీ



సుధీర్‌కు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: పట్టణంలోని 17వ వార్డులో కరెంటు ఆఫీసు వెనుక ప్రాంతంలో నివసిస్తున్న పోసాని సుధీర్‌కు రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోమవారం అందజేశారు. సుధీర్ 3 నెలల క్రితం ఆడుకుంటూ మాగుంట పార్కు సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పొరపాటున తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తన వాహనంలో సుధీర్‌ను జిల్లా వైద్యశాలకు తీసుకునివెళ్లి వైద్యం చేయించారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లి బాధిత బాలునికి నగదు బదిలీ పథకం కింద రూ.5 లక్షలు మంజూరు చేయించారు. సంబంధిత చెక్కును బాలుడి ఇంటికివెళ్లి అందజేశారు. ఇంకా ఏదైనా సాయం అవసరమైతే చేస్తానని, బాగా చదివించాలని సుధీర్ తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్ ఇస్మాయిల్, విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు, ఏడీఈ షియానాయక్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రమేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు



జగనన్న సురక్ష వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

దర్శి: జగనన్న సురక్ష పథకంలో అందుతున్న కార్పొరేట్ స్థాయి వైద్యంపై పేద ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని నగర పంచాయతీ కమిషనర్ మహేశ్వరరావు అన్నారు. నాలుగో సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు యాతం సురేఖ ఆధ్వర్యంలో స్పెషలిస్టు వైద్యులు కిరణ్మయి, సి.వాణి, అచ్చినాయుడు, వైద్య సిబ్బంది 508 మందికి వైద్య చేసి 22 మందిని మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మహేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న ప్రతి వ్యక్తి ఉచిత మందులు, అవసరమైన వారికి ఉచిత పరీక్షలు చేస్తామన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్‌షకీలా అమీన్‌బాషా, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎదురు కోటిరెడ్డి, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబురావు, పుట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

సురక్షను వినియోగించుకోవాలి

త్రిపురాంతకం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గొల్లపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందరికి ఆరోగ్యం కోసం వైద్య పరీక్షలు చేస్తోందన్నారు. తహసీల్దార్ వి.కిరణ్, ఎంపీడీఓ కె.సాంబశివరావు, ఎంఈఓ-2 టి.రాజశేఖరరెడ్డి, ఈఓఆర్‌డీ మురళీమోహన్, వైద్యాధికారులు భాస్కరరెడ్డి, భార్గవతేజ, సర్పంచ్ ఓవీ తిరుమలయ్య, ఎంపీటీసీ ఏసేబు, మాజీ సర్పంచ్‌లు రాజయ్య, గురవయ్య పాల్గొన్నారు. 370 మందికి వైద్య పరీక్షలు చేశారు. 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేసి మందులు అందించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్బారెడ్డి

రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న కనిగిరి అధికారులు

ముండ్లమూరు: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని కనిగిరి క్లస్టర్ సహాయ సంచాలకులు సీహెచ్ రాజారావు తెలిపారు. స్థానిక సంస్థ కార్యాలయంలో సోమవారం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ పనులు పూర్తయిన రికార్డులను ఆడిట్‌కు సిద్ధం చేసుకునే ముందు ఏడు రకాల పారామీటర్స్‌ను పరిశీలించుకోవాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రికార్డుల్లో తేడాలుంటున్నాయన్నారు. వాటిని సరిచేసుకోవడానికి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏపీఓ మురళి, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సమాయకులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు పరిష్కరించండి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘ నాయకులు

మార్కాపురం: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే అర్జీలను పరిష్కరించాలని అధికారులను సబ్‌కలెక్టర్ సేథు మాధవన్ ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో పలు సమస్యలపై సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వర్షాలులేక పంటలు ఎండిపోతున్నాయని, కరువు ప్రాంతంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని నాయకులు జి బాల నాగయ్య, డీకేఎం రఫీ, ఏరువ పాపిరెడ్డి, పీపీ సుబ్బయ్య తదితరులు వినతిపత్రం ఇచ్చారు.

ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం

- ఆర్టీసీ ఆర్‌ఎం సుధాకర్



పొదిలి డిపోను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సుధాకర్

పొదిలి రూరల్: ప్రయాణికులను సురక్షితంగా, సౌకర్యవంతంగా గమ్య స్థానాలకు చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమని ఒంగోలు రీజినల్ మేనేజర్ డి.సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం పొదిలి ఆర్టీసీ డిపోను ఆయన పరిశీలించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్తీకమాసం త్వరలోనే ప్రారంభం కానున్న నేపథ్యంలో మరింత మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. పొదిలి-ఒంగోలు రూట్‌లో గతంలో 7 బస్సులు నడిచేవని, ఇప్పుడు ఆ సంఖ్యను 11కు పెంచామని తెలిపారు. ఇతర డిపోలకు చెందినవి కాకుండా ప్రతి 20 నిమిషాలకు పొదిలి-ఒంగోలు మధ్య 11 బస్సులు 48 ట్రిప్పులు తిరుగుతున్నాయని వివరించారు. టూరిజంలో భాగంగా జిల్లాలోని అన్ని డిపోల నుంచి శ్రీశైలానికి 298, పంచారామం 21, అరుణాచలం 7, ఇతర ప్రాంతాలకు 14 ప్రత్యేక బస్సులు నడిపామని వెల్లడించారు. ఈ ఏడాది అంతకంటే ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. దీనిపై ఇప్పటికే డిపో మేనేజర్లుతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గత ఏడాది ప్రత్యేక బస్సులు నడిపి బాగా ఆదాయం తెచ్చినందుకు ప్రకాశం రీజియన్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఆర్టీసీ కార్గో విధానంలో చాలా మార్పులు చేశామన్నారు. పట్టణానికి 10 కిలోమీటర్ల లోపు ఉంటే డోర్ డేలివరీ సౌకర్యం కల్పిస్తామన్నారు. బస్సుల్లో చిల్లర సమస్య లేకుండా డిజిటల్ పేమెంట్ విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆర్టీసీ కార్గో సేవలపై ఈ నెల 26 నుంచి నవంబర్ 25వ తేదీ వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పొదిలి నుంచి దర్శి, అద్దంకి మీదుగా విజయవాడ వెళ్లే బస్సుల సమయాన్ని మార్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుందరరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

1 నుంచి చినారికట్లలో గడప గడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: నవంబర్ ఒకటో తేదీ నుంచి రెండు రోజుల పాటు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చినారికట్ల గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. సోమవారం చినారికట్ల గ్రామ సచివాలయంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సర్పంచ్ గోసుల అనురాధ వెలుగొండయ్య, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మీ బంగారురెడ్డి, మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. 1వ తేదీ సాయంత్రం చినారికట్ల ఎస్సీ కాలనీలలో 2వ తేదీన చినారికట్ల, జంక్షన్ ప్రాంతంలో కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ముందుగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గడప గడపకూ వెళ్లి కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.

1న గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు ప్రారంభం

1వ తేదీన కొనకనమిట్ల, తువ్వపాడు, చినారికట్ల, గార్లదిన్నె గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి తెలిపారు. ప్రారంభోత్సవానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.

మా భూములకు రక్షణ కల్పించండి

ముండ్లమూరు: ప్రభుత్వం మాజీ సైనికులకు ఇచ్చిన భూమికి రక్షణ కల్పించాలని కోరుతూ మాజీ సైనికులు గంటా రాజేష్, కుమ్మిత వెంకటసుబ్బారెడ్డి సోమవారం తహసీల్దార్ నయీం అహ్మద్‌కు స్పందనలో విన్నవించుకున్నారు. తాళ్లూరు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కుమ్మిత వెంకటసుబ్బారెడ్డికి 2013లో సర్వే నంబర్ 13-44లో రెండు ఎకరాలను, బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన గంటా రాజేష్‌కు అదే ఏడాది సర్వే నంబర్ 318-45లో రెండు ఎకరాలను ప్రభుత్వం కేటాయించి పట్టా మంజూరు చేశారు. ఇటీవల ఆ పొలం వద్దకు వెళ్లగా వేరే వారు ఆ భూమిని సాగు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని తహసీల్దార్‌కు వివరించారు.

మిరపలో సూక్ష్మపోషక లోపం



ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఓ గోపీచంద్

యర్రగొండపాలెం: వర్షాభావ పరిస్థితులతో మిరపలో సూక్ష్మపోషక లోపం ఎక్కువగా ఉందని, రైతులు తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానశాఖాధికారి వై.గోపీచంద్ అన్నారు. సోమవారం మండలంలోని బోయలపల్లి, గురిజేపల్లి, వీరభద్రాపురం, కొలుకుల గ్రామాల్లో ఆయన మిరప పంటను పరిశీలించారు. 19:19:19, ఫార్ములా 4 కలిపి పిచికారీ చేసి మిరపలో సూక్ష్మపోషక లోపాన్ని నివారించుకోవచ్చని సూచించారు. మండలంలో గత సంవత్సరంకంటే 3 వేల ఎకరాల్లో మిరప పంటను అదనంగా సాగు చేస్తున్నట్లు ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేశారని, దీనిపై విచారణ చేయాలని ఉద్యాన శాఖ కమిషనర్ ఆదేశించారని ఆయన తెలిపారు. ఆయన వెంట హెచ్‌వో పి.ఆదిరెడ్డి ఉన్నారు.